# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 149 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

14-04-2026 మంగళవారం వెల : 1 /- పేజీలు : 4


## సువర్ణాధ్యానికి శ్రీకారం ఇది

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- అట్టహాసంగా హంసఫర్ రైలు ప్రారంభోత్సవం
- శ్రీకాకుళం నుండి ఆమదాలవలస వరకు భారీ బైక్ ర్యాలీ
- అసాధ్యం అన్న పనులు సుసాధ్యం చేశాం
- భవిష్యత్ లో మరిన్ని సర్వీసులు చేరువ చేస్తాం





**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా చరిత్రలో నూతన అధ్యాయానికి శ్రీకారం చూడుతూ.. చరిత్రలో నిలచే రోజుగా సోమవారం నిలుస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. సోమవారం నాడు శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ లో శ్రీకాకుళం నుండి తిరుపతి హంసఫర్ రైలును పి. యు. సి ఛైర్మన్ కూన రవికుమార్, ఎమ్మెల్యే గొండు శంకర్,

-మిగతా 2లో

## అరసవల్లిలో సూర్యనారాయణ స్వామి కళ్యాణం వైభవం

- చైత్ర బహుళ ఏకాదశి సందర్భంగా నిర్వహణ
- వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య వేడుక
- భక్తుల భారీ పాల్గొనడం
- ఆలయ అధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమం



**నవతరం -శ్రీకాకుళం**

ప్రత్యక్ష దైవం శ్రీ సూర్యనారాయణ స్వామి వారికి చైత్ర బహుళ ఏకాదశి సందర్భంగా ఆదిత్యుని కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఉష, పద్మిని, ఛాయ సమేత స్వామివారి కళ్యాణం వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాల నడుమ కార్యక్రమం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారులు ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## శ్రీకాకుళం-తిరుపతి రైలు కల నెరవేరు

- దశాబ్దాల కోరికకు ముగింపు
- కొత్త రైలు సర్వీసుపై హర్షం
- రైల్వే అభివృద్ధిలో కీలక నిర్ణయాలు
- కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రైలు సర్వీసు ప్రారంభం కావడం జిల్లా ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని నేతలు తెలిపారు. ఇప్పటివరకు విశాఖపట్నం, భువనేశ్వర్ మార్గాలపై ఆధారపడాల్సి వచ్చిన ప్రజలకు ఈ కొత్త సర్వీసు ఉపశమనం కలిగించనుంది. రైల్వే రంగంలో జరిగిన మార్పులతో జిల్లాకు మరింత సౌకర్యాలు అందుతున్నాయని, సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌లో ప్రాంతాల విలీనం కూడా కీలక అడుగని పేర్కొన్నారు. కొత్త సర్వీసుతో భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం, ఎక్కువ బెర్తులు లభించనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## వీబీ జీ రామ్ జీ పథకం వినియోగించుకోండి

- ఉపాధి పనుల ప్రారంభం
- 125 రోజులకు పనిదినాల పెంపు
- డిజిటల్ చెల్లింపులతో పారదర్శకత
- గ్రామాభివృద్ధికి పథకం దోహదం



**నవతరం -బూర్జ**

బూర్జ మండలం ఒప్పివాడ వెంకంపేట గ్రామంలో వీబీ జీ రామ్ జీ పథకం కింద ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మండల ఉపాధ్యక్షుడు బుడుమూరు సూర్యారావు, వేతనదారులు ఈ

-మిగతా 2లో

## 3 కిలోల గంజాయి పట్టివేత... ముగ్గురు అరెస్ట్

- నాగావళి నది ఒడ్డున పోలీసుల దాడి
- ఒడిశా నుంచి అక్రమ రవాణా
- బైక్‌తో పాటు గంజాయి స్వాధీనం
- నిందితులపై పలు కేసులు

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం పట్టణంలో 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కంపోస్ట్ కాలనీ సమీపంలోని నాగావళి నది ఒడ్డున నిర్వహించిన దాడిలో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. పోలీసులను గమనించగానే నిందితులు పారిపోవడానికి ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న పాలిథిన్ కవర్లలో గంజాయి లభించడంతో పాటు ఒక మోటార్ సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి తెచ్చి పట్టణంలో చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నట్లు తేలింది. నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

## వైసీపీ నేత నర్తు నాయుడు మరణం

- కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ
- ప్రగాఢ సానుభూతి వ్యక్తం
- గ్రామంలో విషాద వాతావరణం
- పార్టీ నేతల నివాళులు



**నవతరం -కొత్త పుట్టుగ**

కొత్త పుట్టుగ గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు నర్తు నాయుడు మృతిచెందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నాయుడు సేవలను స్మరించుకుంటూ పార్టీ నాయకులు, గ్రామస్థులు నివాళులు అర్పించారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## జనతా వారధి ద్వారా ప్రజా సమస్యల స్వీకరణ

- జెడ్పీ కార్యాలయంలో కార్యక్రమం - కలెక్టర్‌కు వినతిపత్రం
- హాస్టళ్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి - కార్యక్రమంలో పాల్గొన బీజేపీ నాయకులు

2లో



ఎడిటోరియల్

# వేసవి ప్రణాళిక

రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి.. ఉష్ణోగ్రత 35 డిగ్రీలను దాటి 40 డిగ్రీల వైపు శరవేగంగా పరిగెడుతోంది. ఏప్రిల్ మొదటి వారంలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే.. మేలో ఎలా ఉంటుందోనని జనాలు ఆందోళన చెందుతున్నారు. పల్లెలు, పట్టణాలు, నగరాలనే తేడా లేకుండా నీటి ఎద్దడి తీవ్రతరమవుతోంది. కొండ ప్రాంతాలు, ఆదివాసీ, గిరిజన గూడేల్లో ఇది మరింత ఎక్కువగా ఉంది. అధికారిక సమాచారం ప్రకారమే మహబూబ్‌నగర్,నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్, వికారాబాద్ జిల్లాల్లో ఇప్పటికే తాగునీటికి కటకట ఏర్పడింది. ఈ జిల్లాల్లోని 19 నియోజకవర్గాలు, 3,200 గ్రామాల్లో నీటి కొరత ఏర్పడే ప్రమాదముందని అంచనా. దీన్ని అధిగమించేందుకు అన్ని రకాల ప్రణాళికలు రచించామని ప్రభుత్వం చెబుతోంది. గత రెండేండ్ల నుంచి వీటిని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఉన్నతాధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ, పరిస్థితి మాత్రం ఆశాజనకంగా లేకపోవటం గమనార్హం.

గతేడాది కృష్ణా బేసిన్‌లో అనుకున్నంత స్థాయిలో వర్షాలు పడలేదన్నది గణాంకాల సారాంశం. ఆ ప్రభావం ఈ వేసవిలో ఉండబోతున్నది వాతావరణ శాఖ వర్గాల భోగట్టా. ఈ క్రమంలో పలు రిజర్వాయర్లలో నీటి మట్టం అనుకున్నంత స్థాయిలో లేదు. మరోవైపు ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీటిలో పొదుపు తప్పదనే సంకేతాలు బలంగా వినబడుతున్నాయి. అలాంటప్పుడు ఫ్లోరైడ్ ప్రభావిత ఉమ్మడి పాలమూరు, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లోని ప్రజలు మినరల్ వాటర్ మీద ఆధారపడా ల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇప్పటికే 20 లీటర్ల క్యాన్‌కు రూ.10 నుంచి రూ. 20 వసూలు చేసున్న నీటి వ్యాపారులు.. రాబోయే రెండు నెల్లపాటు 'డిమాండ్-సప్లయ్' సూత్రాన్ని విధిగా పాటించాలని నిర్ణయించారు. అప్పుడు గుక్కెడు నీటి కోసం జనాలు పడరాని పాట్లు పడాల్సి రావటం ఖాయం.

జీడీపీలు, జీఎస్‌డీపీలు, వృద్ధి రేటు గురించి మన పాలకులు, ప్రభుత్వాధినేతలు గొంతు చించుకుని ఎంత గొప్పలు చెప్పుకున్నా.. చుక్క నీటికోసం దళితులు, ఆదివాసీలు మైళ్ల కొద్దీ నడవాల్సి రావటం వారి విధానాల్లోని డొల్లతనాన్ని తెలియజేస్తోంది. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో ఈ దృశ్యాలు మనకు ఎక్కువగా కనబడుతుంటాయి. బిందెలు నెత్తిన పెట్టుకుని మహిళలు మండుటెండలో నడుస్తున్న ఫొటోలు అనునిత్యం పత్రికల్లో ప్రత్యక్ష మవుతుంటాయి. ఎందుకంటే హైదరాబాద్‌లోలాగా ఆయా ప్రాంతాల్లో ఏ కంపెనీగానీ, ఏ వ్యక్తీగానీ 'చలివేం ద్రాలు' ఏర్పాటు చేయరు కాబట్టి. రెక్కాడితేగాని డొక్కాడని వ్యవసాయ కార్మికులు, ఇతర పేదలకు అన్ని కాలాల్లో, ముఖ్యంగా పనులు దొరకని వేసవిలో ఇప్పటిదాకా ఇంత బువ్వ పెట్టింది 'ఉపాధి హామీ' చట్టం. కానీ దాని పేరును మార్చి..ఆ చట్టం ఉద్దేశాన్ని ఏమార్చి... అన్నింటికీ 'రామ్.. రామ్...' చెప్పేసింది మోడీ ప్రభుత్వం. నిధుల్లో కోత పెట్టి, పని దినాలను కట్ చేసి, వారి కడుపు మీద కొట్టింది. అలాంటప్పుడు తమది ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వారు కేంద్రంతో కొట్లాడైనా సరే..ఇలాంటి పేదలందర్నీ విధిగా ఆదుకోవాలి. అందరికీ పని కల్పించటంతోపాటు పని ప్రదేశాలు, గృహాలకు కూడా సురక్షితమైన తాగునీటిని అందించాలి. ఇక రాజధాని హైదరాబాద్‌తోపాటు కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో 'వాటర్ మాఫియా' గురించి చెప్పాల్సిన పనిలేదు. ఈ దందా ద్వారా ఈ రెండు మూడు నెలల్లో ఏడాదికి సరిపడా సంపాదించు కుంటారనేది బహిరంగ రహస్యం. విల్లాలు, అపార్టుమెంట్లు, కాలనీలు, బస్తీల్లోని ప్రజల నీటి అవసరా లను ఆసరాగా చేసుకుని ఇబ్బడిముబ్బడిగా దండుకుంటారు వాటర్ ట్యాంకర్ల యాజమాన్యాలు. ఆ సమయాల్లో వాటర్ వర్క్స్, జలమండలి అధికారుల ఫోన్లు 'ఎందుకోగాని' మూగబోవటం పరిపాటి.

ఈ దుస్థితిని నుంచి ప్రజలను బయటపడేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలి. తెలంగాణ వ్యాప్తంగా రాజధాని నుంచి పంచాయతీ వరకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ప్రజలకు మంచి నీటిని అందించటమనేది తమ కనీస బాధ్యతగా ప్రభుత్వాధినేతలు గుర్తించాలి. వాటర్ మాఫియా దోపిడీని అరికట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను రంగంలోకి దించాలి. ఎక్కడెక్కడ నీటి ఎద్దడి ఉందో.. అక్కడక్కడ నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించి, అమలు చేయించాలి. జిల్లా కలెక్టర్లు, పంచాయతీరాజ్ అధికారులు, మున్సిపల్ ఆఫీసర్లకు ఆ మేరకు తగినన్ని నిధులు కేటాయించాలి. లేదంటే 'గుక్కెడు నీటి కోసం గోస...' అనే పతాక శీర్షికలతో పత్రికల్లో వార్తలు రాకమానవు.

# గిరిజన ప్రాంతాల్లో నీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**నవతరం -కొత్తూరు**

గిరిజన ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, గిరిజనులు కలిసి మండల అధికారికి వినతిపత్రం సమర్పించారు. గొట్టిపల్లి, అడ్డంగి, దిమిలి, పొంటూరు తదితర పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్నదని తెలిపారు. వేసవి కాలంలో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అధికారిణి స్పందిస్తూ సంబంధిత శాఖలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

- కొత్తూరులో వినతిపత్రం సమర్పణ
- పలు గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి
- ఆందోళనలకు హెచ్చరిక
- సమస్య పరిష్కారానికి హామీ

ఈ కార్యక్రమంలో గిరిజనులు, నాయకులు పాల్గొన్నారు.

# జనతా వారధి ద్వారా ప్రజా సమస్యల స్వీకరణ

**నవతరం -శ్రీకాకుళం**

ప్రజా సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో బీజేపీ ఆధ్వర్యంలో "జనతా వారధి" కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజల నుంచి సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంక్షేమ హాస్టళ్ల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సువర్ణాధ్యానికి శ్రీకారం ఇది

మొదటిపేజీ తరువాయి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్, డి. ఆర్. ఏం లలిత్ బోహ్రా తో కలసి ప్రారంబించారు.

అంతకుముందు శ్రీకాకుళం నగరంలోని తన క్యాంప్ కార్యాలయం నుండి అమదలవాలస రైల్వే స్టేషన్ వరకు ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో జరిగిన భారీ బైక్ ర్యాలీ కార్యక్రమంలో కేంద్రమంత్రి స్వయంగా ద్విచక్ర వాహనం నడుపుతూ పాల్గొన్నారు. శ్రీకాకుళం లో ప్రారంభం అయింది మొదలు. ఆమదాలవలస వరకు.. ప్రజలు.. ఈ ర్యాలీలో రామ్మోహన్ నాయుడుకు బ్రహ్మ రథం పట్టారు.. చరిత్రలో నిలచే గొప్ప పని చేసావంటూ నినదించారు. ఆద్యంతం ఆనంధహేల మధ్య ర్యాలీ ఆమదాలవలస వరకూ సాగింది. శ్రీకాకుళం నగరంలో క్యాంప్ కార్యలయం వద్ద, బలగ, రాగోలు, కొత్త రోడ్డు కూడలి, చింతాడ కూడలి.. ఇలా పలు ప్రాంతాల్లో కేంద్ర మంత్రి బైక్ ర్యాలీకి ఎదురు వచ్చిన ప్రజలు.. పూల వర్షాన్ని కురిపించారు. హారతులు పట్టి తమ హర్షాన్ని తెలియపరిచారు.

అమదలవాలస చేరుకున్న కేంద్ర మంత్రి ర్యాలీ.. అంతే ఉత్సాహంతో సభా ప్రాంగణంకు చేరుకుంది. అప్పటికే పూలదండలతో ముస్తాబు చేసిన హంసఫర్ రైలును చూసి అక్కడివారంతా మురసిపోయారు. శ్రీకాకుళం రోడ్ టూ తిరుపతి అన్న పేరు చూసి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సైతం రైలును ఎక్కి అప్పటికే.. సీట్లలో కూర్చుని ఉన్న ప్రయాణీకులతో కాసేపు ముచ్చటించారు. తిరుమల వేంకటేశ్వరుని ధర్శనం చక్కగా జరగాలని ఆకాంక్షించారు.

ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. డి. ఆర్. ఏం లలిత్ బోహ్రా, ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ లు మాట్లాడుతూ రామ్మోహన్ నాయుడు పనితీరును ప్రశంసించారు. మంచి ఆరంభం లభించిందని.. భవిష్యత్ లో రైల్వే విషయంలో మరిన్ని విప్లవాలు సృష్టించాలని ఆకాంక్షించారు. అమదలవాలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి చొరవను ప్రశంసించారు. అదేవిధంగా.. హంసఫర్ రైలును పొందూరులో కూడా హాల్ట్ లభించేలా కృషి చేయాలని కోరారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న రామ్మోహన్ నాయుడు.. ఎన్నో ఏళ్ల కల సాకారం అయింది అంటూ తనదైన శైలిలో ప్రసంగాన్ని ప్రారంభించారు. 75 ఏళ్ల సిక్కోలు చరిత్రలో ఇలాంటి రోజు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని రామ్మోహన్ నాయుడు అన్నారు. తాను పార్లమెంటు సభ్యునిగా అడుగు పెట్టిన మొదటి రోజు నుండి ఇదే లక్ష్యాని ఎంచుకుని.. తీవ్ర స్థాయి ప్రయత్నాలను ప్రారంభించానని తెలిపారు. ఎన్నో సమావేశాల్లో ఇదే విషయం మాట్లాడానని, ప్రతీ రైల్వే మంత్రిని కలసి అవసరాన్ని ఒకటికి రెండుసార్లు గుర్తు చేశానని అన్నారు. వెంకన్న ఆశీస్సులు ఉన్నాయి కాబట్టే ఇది సాదయమైందని అన్న రామ్మోహన్ నాయుడు.. భవిష్యత్ లో హైదరాబాద్ కు సైతం ఇక్కడి నుండే రైలు ప్రారంభం అయ్యేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

హంసఫర్ రైలు విషయంలో మూడు రోజుల క్రితం బుకింగ్స్ ప్రారంభిస్తే 97 శాతం సీట్లు రిజర్వు అవ్వడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఒకప్పుడు ఉత్తరాంధ్ర లోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుండి బుక్ చేస్తే కేవలం కొంత కోటా మాత్రమే శ్రీకాకుళం కు అంధుబాటులో ఉండేదని.. ఇకపై 1400 సీట్లలో 80 శాతం సీట్లు మన జిల్లాకు కేటాయింపు జరగనున్నాయని రామ్మోహన్ నాయుడు శుభవార్త తెలిపారు. ఇది సిక్కోలు ప్రజల సౌకర్యం కోసం తెచ్చిన రైలు కాదని.. ఇది.. జిల్లా ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవనుందని రామ్మోహన్ నాయుడు అన్నారు. అన్నీ జిల్లాల కన్నా మనమేమీ తక్కువ కాదని చూపేలా.. రేపు.. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మీదుగా మన జిల్లా పేరును తనపై వేసుకుని రైలు మోసుకుని పోతూ ఉంటే.. చాలా గర్వంగా ఉంటుందని రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రధాని మోడి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. ఇలా అందరి ఆలోచనలు జిల్లా ప్రగతిపై సమిష్టిగా ఉన్నాయని.. ఆంధ్రప్రదేశ్ కు ముఖద్వారంగా శ్రీకాకుళం చేయాలని వారి ఆలోచన అని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

ప్రపంచంలో, దేశంలో ఎక్కడికి వెళ్ళినా సిక్కోలు ప్రజలు మనకు కనిపిస్తారని.. పొట్టకూటి కోసం వెళ్ళే పరిస్థితులు మారి.. జిల్లాలోనే వారికి ఉపాధి లభించేలా చేయాలనేది తన సంకల్పం అని రామ్మోహన్ నాయుడు అన్నారు.

మూలపేట పోర్టు, ఎయిర్ పోర్ట్, జాతీయ రహదారులు, రైల్వేలు, ఇలా అన్నీ రంగాలను అభివృద్ధి చేసుకుంటూ లాజిస్టిక్ హబ్ గా వృద్ధిలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా తనకు ప్రధాని మోడీ స్పష్టమైన లక్ష్యాలను నిర్ధేశించారని.. రానున్న అయిదేళ్లలో ఏభై ఎయిర్పోర్టు నిర్మిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశం మొత్తం ఎయిర్పోర్ట్ లు నిర్మించే తాను.. శ్రీకాకుళం లో సైతం నిర్మిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

శ్రీకాకుళం జిల్లాలో రైల్వేల అభివృద్ధి కోసం తాను, కూన రవికుమార్ గతంలో అలుపెరగని పోరాటం చేసేవాళ్ళమని, పోరాడాం, ఎదుర్కొన్నాం, నిలబడ్డాం, అభివృద్ధి సాధించామని రామ్మోహన్ నాయుడు అన్నారు. రైల్వే జోన్ సాధన వల్ల కలిగే ఉపయోగాలు.. సామాన్య ప్రజల కన్నా.. రైల్వే ఉద్యోగులకు ఎక్కువగా తెలుస్తాయని.. మీకు తెలిసిన రైల్వే ఉద్యోగుల ద్వారా జోన్ ఉపయోగాలు తెలుసుకోవడం అందరి భాధ్యత అని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఉద్దాన ప్రాంతంలోని ఏడు స్టేషన్లను విశాఖ రైల్వే జోన్ లోకి తీసుకువచ్చామని అన్నారు.

అసాధ్యం అన్న పనులన్నీ పూర్తి చేసి.. శ్రీకాకుళం జిల్లాలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టామని.. నూతనంగా ప్రారంభమైన ఈ రైలును అందరు సద్వినియోగం చేసుకోవాలని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆమదాలవలస రైల్వే స్టేషన్ లో 35 కోట్ల రూపాయలతో నూతన టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం లో ఉందని, చింతాడ నుండి రైల్వే స్టేషన్ కు 70 అడుగుల రహదారి త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చి.. మరిన్ని వసతులు చేరువ చేస్తామని రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. రెండు లైన్లను.. నాలుగు లైన్లగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

శ్రీకాకుళం జిల్లాలో రైల్వే ల అభివృద్ధికి పూర్తి తోడ్పాటు అందిస్తున్న రైల్వే శాఖామంత్రి అశ్విని వైష్ణవ్ గారికి ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఉన్న రైల్వే ట్రాక్ లను రానున్న రెండేళ్ళల్లో మూడు లైన్లుగా మార్చుతామని అయన హామీ ఇచ్చినట్టు తెలిపారు.

రైల్వే అంటే.. గతంలో గుర్తుకువచ్చే పేరు కింజరాపు ఎర్రంనాయుడు అని తెలిపిన రామ్మోహన్ నాయుడు.. రైల్వే స్టాండింగ్ కమిటి సభ్యులుగా తన తండ్రి.. జిల్లాలో రైల్వే ఉన్నతికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్టు స్పష్టం చేశారు. నౌపాడ గుణుపూర్ లైన్ ను అభివృద్ధి చేసిన ఘనత ఆయనదేనని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ.. అదే లైన్ లో నాలుగు క్రాసింగ్ స్టేషన్ లను ఏర్పాటు చేస్తున్నట్లు రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు.

శ్రీకాకుళం తిరుపతి హంసఫర్ రైలును అందరూ వినియోగించి.. 100 శాతం అక్యుపెన్సి తీసుకురావాలని అన్నారు. ఇలా అయితే వారానికి మరిన్ని రోజులు సర్వీసు కోరే విధంగా రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు.

జిల్లాలో రైల్వేల అభివృద్ధి కోడి ముందా.. గుడ్డు ముందా అన్నట్టు ఉండేదని అన్న రామ్మోహన్ నాయుడు.. ప్రస్తుతం సర్వీసు ప్రారంభం కావడంతో.. ఇకపై మెంటేనేన్స్ కూడా జిల్లాకు అందుబాటులోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# వీబీ జీ రామ్ జీ పథకం వినియోగించుకోండి

మొదటిపేజీ తరువాయి

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పథకం ద్వారా పేదరిక నిర్మూలన, స్వయం ఉపాధి కల్పనతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. 100 రోజుల పనిని 125 రోజులకు పెంచడం, వేతనాలను డిజిటల్ విధానంలో త్వరితగతిన చెల్లించడం జరుగుతుందని చెప్పారు.

పని అందుబాటులో లేకపోతే నిరుద్యోగ భృతి కల్పన వంటి అంశాలు ఈ పథకానికి బలాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తప్పు దొర్లని పాసు పుస్తకాల పంపిణీ లక్ష్యం కావాలి



**నవతరం -జలుమూరు**

జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రైతులకు అందజేసే కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ ప్రక్రియలో ఎక్కడా చిన్న పొరపాటుకు కూడా తావుండకూడదని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన జలుమూరు మండలం అక్కురాడ సచివాలయాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రధానంగా పాసు పుస్తకాల ముద్రణకు సంబంధించి జరుగుతున్న కసరత్తుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో సిద్ధం చేసిన జాబితా నుంచి రాండమ్‌గా 40 పేర్లను ఎంపిక చేసిన జేసీ, వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పేర్ల నమోదులో ఉన్న కొన్ని లోపాలను గుర్తించి, తక్షణమే మార్పులు చేయాలని సూచించారు. పాసు పుస్తకంలో ఒక్క అక్షరం తప్పుగా పడినా రైతు ఇబ్బంది పడతారు. ప్రతి పేరును అత్యంత జాగ్రత్తగా సరిచూసుకోవాలి. ఇందులో తప్పులు దొర్లితే అది సిబ్బంది నిర్లక్ష్యంగానే పరిగణించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

గ్రామానికి చెందిన 10 మంది రైతుల నుంచి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న జేసీ, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు వివరించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ జన్నీ రామారావు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ జీవితమంతా యుద్ధ రంగమే !



అందరిలో ప్రవహించే రక్తం ఒక్కటే. అయితే అగ్రవర్ణాల వారని అంటరానివారని ఇలా భేదాలు ఎందుకు ఏర్పడ్డాయని తనలో తాను ప్రశ్నించుకోనేవాడు మనుషుల్లో అంటరానితనాన్ని రూపుమాపాలని మనస్సులో చేయించుకున్నాడు తన పట్ల తన కులం వారి పట్ల ఆనాటి ప్రజలు సమాజం వ్యవహరిస్తున్న తీరు అతనిని మనసును కలచివేసి అందరూ మనుషులే అందరిలో ప్రవహించే రక్తం ఒక్కటే అయితే అగ్రవర్ణాల వారని అంటరానివారనే ఇలా భేదాలు ఏర్పడినాయి అని తనలో తాను ప్రశ్నించుకునేవాడు అంబేద్కర్. మానవులలో గల ఈ అంటరానితనాన్ని రూపుమాపాలని మనసులు నిశ్చయించుకున్నాడు తన వంతు కృషి చేశాడు.

భీమారావు రాంజీ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14వ తేదీన మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా అంబే వాడలో జన్మించారు తండ్రి పేరు రాంజీ సర్పాల్. సైన్యములో చిన్న ఉద్యోగం చేసేవాడు. బాల్యంలో పాఠశాలలో చదివే సమయంలో అంబేద్కర్ తెలివైన విద్యార్థిగా మంచి పేరు తెచ్చుకున్నాడు హై స్కూల్లో అత్యధిక మార్కులు సంపాదించడం వల్ల భరోడా మహారాజు అందించిన ప్రత్యేక స్కాలర్షిప్తో కళాశాలలో చదివే అవకాశం లభించింది.

1913 లో అమెరికా వెళ్లి కొలంబియా విశ్వవిద్యాలయంలో చదివే సమయంలో అక్కడ నీగ్రోల పరిస్థితి చూశారు వారి ఐక్యత కోసం అబ్రహం లింకన్ లాంటివారు కృషి చేయడం గమనించాడు అప్పుడు అక్కడ రాజ్యాంగంలో కొన్ని మార్పులు కూడా జరిగాయి ఈ సంఘటన వీరిని విశేషంగా ఆకర్షించింది. 1917లో పీహెచ్డీ పూర్తి చేశారు 1928లో బారిష్టర్ పట్టా సంపాదించారు. దళితుల అభ్యుదయం కోసం ఎన్నో గ్రంథాలు రచించారు. 1947 లో స్వాతంత్రం లభించిన పిదప అప్పటి భారత ప్రధాని జోహార్ లాల్ నెహ్రూ వీరిని న్యాయశాఖ మంత్రిగా నియమించారు. భారత రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగ రచన సంఘానికి అంబేద్కర్ అధ్యక్షులుగా నియమింపబడ్డారు. 1990లో కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం "భారతరత్న బిరుదు" ఇచ్చి గౌరవించడం జరిగింది. దళిత బాంధవుడిగా ,స్ఫూర్తి ప్రదాతగా, చైతన్య దీప్తిగా ,రాజ్యాంగ కర్తగా, అంటరానితనం రూపం ఆపడానికి కృషి చేసిన కార్యకర్తగా, భారతీయుల హృదయాంతరాలలో వెలుగుతున్న ఆశాజ్యోతిగా నిలిచిన వాడు అంబేద్కర్.

"భారత రాజకీయాల్లో మహాత్మాగాంధీతో పాటు, డాక్టర్ అంబేద్కర్ మహాగొప్ప వ్యక్తి. హిందూ కులాల్లో పుట్టిన వాళ్ళందరికన్నా మేధావి. ఇటువంటి వ్యక్తుల గొప్ప కృషివల్ల కుల వ్యవస్థతో కూడిన హిందూయిజం దెబ్బతినక తప్పదు. స్వతంత్ర వ్యక్తిత్వం, వివేకం, నిలు వెత్తు నిజాయితీ కలిగిన అంబేద్కర్ భారతదేశం గర్వించదగ్గ ముద్దు బిడ్డ" అంటూ అంబేద్కర్ని కొనియాడిన వ్యక్తి మరెవరో కాదు రామ్ మనోహర్ లోహియానే. సోషలిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన రామ్ మనోహర్ లోహియా అంబేద్కర్ మరణానంతరం ఆయనపై చేసిన వ్యాఖ్య ఇది. నిజానికి బాబాసాహెబ్ అంబేద్కర్, రామ్ మనోహర్ లోహియాలు ప్రత్యక్షంగా కలుసుకున్న సందర్భంలేదు.

గతంలో ఏ పార్టీ, ఏ రాజనీతివేత్తా చెప్పని విధంగా భూమిని జాతీయం చేయాలనీ, పరి శ్రమలను, ఆర్థిక, వాణిజ్య సంస్థ లను ప్రభుత్వమే నిర్వహించాలనీ సూచించిన గొప్ప సామ్యవాది అంబే డ్కర్. 1916లో అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో కులాల పుట్టుకను శోధించే ప్రయత్నం మొదలు పెట్టారు. 1927లో కుల వివక్షకు వ్యతిరేకంగా మహద్ చెరువు సత్యాగ్రహం, కాలారామ్ దేవాలయ ప్రవేశ ఉద్యమాలు ఆయన కార్యా చరణ కొనసాగింపు. 1935లో అంటరానితనం. కుల వివక్ష సమసిపోవా లంటే కుల నిర్మూలనే మార్గమంటూ భారత ప్రజలకు ఒక తాత్విక సైద్ధాంతిక భూమికను అందించారు. ఆ తర్వాత అంటరాని వారెవరు? శూద్రులెవరు? అన్న తన పరిశోధనలను కొనసాగిస్తూ, భారతదేశ కుల సమాజం అంతం కావడానికి బౌద్ధం చక్కటి పరిష్కార మార్గమని భావించి బుద్ధుడిని అనుసరించారు.

మూడో అంశంగా, రాజకీయ హక్కులు... 1919లో సౌత్బరో కమిటీ ముందు చేసిన ప్రసంగం మొదలుకొని 1955 లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రణాళికను రూపొందించేంతవరకు ఆయన జీవితమంతా ఒక యుద్ధరంగమే. రణక్షేత్రం నుంచే ఆయన ఆలోచనలు సాగాయి. వయోజన ఓటింగ్ హక్కుతోపాటు, అన్ని వర్గాలకు, ప్రత్యేకించి అణగారిన వర్గాలకు రాజకీయ హక్కుల కోసం ఆయన తన సర్వస్వాన్నీ అంకితం చేశారు.

అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రముఖ విద్యా వేత్త జాన్ డ్యూయి మార్గదర్శకత్వంలో అంబేద్కర్ రాజకీయ పాఠాలు నేర్చుకున్నారు.
అప్పటికే అక్కడ జరుగుతున్న నల్లజాతి ప్రజల పోరా టాలు అంబేద్కర్ను ప్రభావితం చేశాయి. రాజనీతి శాస్త్రంలో ప్రజా స్వామ్య భావనకు ఉన్న గొప్పతనాన్ని జాన్డ్యూయి ద్వారా అంబేద్కర్ అర్థం చేసుకోగలిగారు. అదే రాజకీయ హక్కుల పోరాట ఉధృతికి అంబేద్కర్ నడుం కట్టేలా చేసింది.
1919లో సౌత్బరో కమిటీ ముందు ఇచ్చిన వాంగ్మూలం, సైమన్ కమిషన్ పర్య టనలో అంటరాని కులాల హక్కులకై గొంతెత్తి చాటారు. ఆ తర్వాత 1931, 32లలో లండన్లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరయ్యారు. ప్రత్యేక ఓటింగ్ హక్కు అయిన కమ్యూనల్ అవార్డు సాధించారు. గాంధీ కుట్ర కారణంగా పూనా ఒడంబడిక అనే బృహత్తర కార్య క్రమం నిలిచిపోయింది. దాని ఫలితంగా ప్రత్యేక ఓటింగ్ విధానం లేకుండా పోయింది.

అయితే 1935లో మొట్టమొదటిసారిగా 'భారత చట్టం'(ఇండియన్ యాక్ట్ 1935)ను బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దాని ప్రాతిపదికగా, 1937లో జరిగే ఎన్నికల్లో పాల్గొనడం కోసం 1936లో అంబేద్కర్ ఇండిపెండెంట్ లేబర్ పార్టీ(ఐఎల్పీ)ని స్థాపించారు. మహారాష్ట్రలో ఆ పార్టీ 17 స్థానాల్లో పోటీచేయగా, 14 స్థానాల్లో విజయం సాధించింది. అందులో పదకొండు రిజర్వుడ్ స్థానాలుకాగా, మూడు జనరల్ స్థానాలు కూడా ఉన్నాయి. అప్పుడు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రత్యర్థి పార్టీగా ఉన్నది. అయితే జయప్రకాశ్ నారాయణ్, ఆచార్య నరేంద్ర దేవ్, రామ్ మనోహర్ లోహియా స్థాపించిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ మాత్రం అంబేద్కర్ నాయకత్వం వహిస్తున్న ఇండిపెండెంట్ లేబర్ పార్టీకి మద్దతు పలికింది. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ కేవలం అంటరాని కులాల కోసం ఆవిర్భవించిన పార్టీ కాదు.అంటరాని కులాల హక్కులు, వారి ప్రయోజనాలు ఆ పార్టీకి ముఖ్యమే కానీ అంతకుమించిన విస్తృతమైన ఆకాంక్షలతో ఆపార్టీఅవతరించింది. అందుకే కార్మికుల, రైతు కూలీల హక్కులు ఆ పార్టీకి ప్రాథమిక లక్ష్యాలు అయ్యాయి. పరిశ్రమలు పూర్తిగా ప్రభుత్వ అధీనంలో నడవాలనేది ఆ లక్ష్యాల్లో ఒకటి. అంటే ఐఎల్పి కార్మికవర్గ దృక్పథంలో అవతరించిందనేది సుస్పష్టం.1937 ఎన్నికల తర్వాత కేబినెట్ మిషన్ అనే పేరుతో భారతదేశ రాజకీయ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అనే అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన క్రిప్స్ కమిటీ ముందు కూడా అంబేద్కర్ తన వాదనలను విని సించారు. స్వతంత్ర భారత దేశంలో ఏర్పడే రాజ్యాంగంలో తమకు ప్రత్యేక హక్కులు ఉండాలని నిర్ద్వంత్వంగా ప్రతిపాదించారు.
అయితే, "బేబర్ పార్టీ నాయకుడైన నీకు అంటరాని కులాల కోసం ప్రత్యేకంగా మాట్లాడే హక్కు లేదు" అన్న కమిటీ మాటలను పరిగణనలోకి తీసు కొని, ఇండిపెండెంట్ లేబర్ పార్టీ స్థానంలో ఆల్ ఇండియా షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫెడరేషన్ను స్థాపించారు. దీంతో షెడ్యూల్డ్ కులాల హక్కుల రక్షణ ఈ పార్టీ ప్రాథమిక ఎజెండాగా మారింది. 1942లో ఏర్ప డిన ఈ పార్టీ రాజ్యాంగ సభ ఎన్నికల్లో, 1962 జనరల్ ఎన్నికల్లో పోటీ చేసింది. కొన్ని స్థానాలు గెలిచినప్పటికీ, అనుకున్నంత ఫలితాలు సాధిం చలేకపోయింది. దీనితో మళ్లీ అంబేద్కర్ రాజకీయ ఉద్యమం నడపడా నికి కేవలం షెడ్యూల్డ్ కులాల పేరుతో పార్టీ నిర్మాణం సరికాదని భావిం చారు. కుల ప్రాతిపదికగా ఏర్పడిన రాజకీయ పార్టీ విస్త తమైన రాజ కీయ వ్యవస్థను శాసించలేదని అంబేద్కర్ అభిప్రాయం. అందుకే 1955లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా 'పేరుతో ఒక' రాజకీయ పార్టీకి అంకురార్పణ చేయాలని భావించి, ఒక ప్రణాళికను తయారు చేశారు. భారత రాజ్యాంగంలోని పీఠికను ఆర్పీఐ ప్రాథమిక లక్ష్యంగా అంబేద్కర్ ప్రకటించారు.ప్రణాళికలో ఆ పీఠికను యథాతథంగా పొందుపరిచారు. "న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం ఆశయా లుగా కొత్త పార్టీని ప్రకటించారు. కానీ ఆర్పీఐ పార్టీ అంబేద్కర్ మరణానంతరం మాత్రమే ఉనికిలోకి వచ్చింది. 1962 జనరల్ ఎన్నికల నుంచి అంబేద్కర్ తన రాజకీయ గమ్యం,గమనం కోసం ప్రయత్నించారు.అందులో భాగంగానే సహజ మిత్రుల కోసం అన్వేషించారు. ఆ క్రమంలోనే సోషలిస్టు పార్టీ నాయకులు రామ్ మనోహర్ లోహియాతో
దనేది సుస్పష్టం. కేబినెట్ మిషన్ అనే అంబేద్కర్ సత్సంబంధాలేర్పడ్డాయి. కానీ వాళ్ల కలయిక జరగకుం దానే, వారి రాజకీయ కల సాకారం కాకుండానే అంబేద్కర్ కన్ను మూయడం పెద్దలోటు.

ఆ తర్వాత ఉనికిలోకి వచ్చిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా మొదట్లో లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసినప్పటికీ, తర్వాత అంతర్గత కలహాలతో ఉనికినే పోగొట్టుకున్నది. అంబేద్కర్ తన జీవిత చరమాం కంలో చేసిన రాజకీయ ఆలోచనలు, ఆశించిన కార్యాచరణ ఇంకా పూర్తి కాలేదు. షెడ్యూల్డ్ కులాల హక్కుల కోసం తుదిశ్వాస వరకూ పోరాడి నప్పటికీ, అంతిమంగా ఒక ప్రజాస్వామ్య సమాజంలోనే దీనికి సంపూర్ణ పరిష్కారం సాధ్యమని బలంగా అభిప్రాయపడ్డారు. ఒక మని షికి, ఒక ఓటు, ఒక ఓటు-ఒక విలువ ద్వారా రాజకీయ ప్రజాస్వామ్యం లభిం చినప్పటికీ, ఆర్థిక, సామాజిక అసమానతలు కొనసాగుతున్నాయని, రాజ్యాంగ సభ చివరి సమావేశం సందర్భంగా 1949, నవంబర్ 25న చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. కుల నిర్మూలన ద్వారా సామాజిక ప్రజాస్వామ్యం, ప్రజలందరికీ సమానావకాశాల ద్వారా, పెట్టుబడిదారీ వ్యవస్థ నియంత్రణ, ఆర్థిక ప్రజాస్వామ్యం అందించాలని అంబేద్కర్ అభిలషించారు. అందుకే భారతదేశంలోని కుల వ్యవస్థను, పెట్టుబడి దారీ వ్యవస్థను కూకటివేళ్ళతో పెకిలించడానికి ఒక మహాప్రజాస్వామ్య ఉద్యమం ప్రారంభం కావాలి.


ఏ కులం చిన్నది కాదు ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు. అన్ని కులాలు సమానమే. జన్మనా జాయతే శూద్ర అని అంటారు. పుట్టుకతో అందరూ శూద్రులే. కుల వివక్షను భారత రాజ్యాంగం నిషేధించింది. అయినా సాహిత్యం, సంస్కృతి, పురాణ ఇతిహాసాలు, కళలు, సామెతలు, నుడికారాలు, భాష, వ్యాకరణ, రూపంలో కుల వివక్ష, కుల అంతరాలు ప్రచారం చేయబడుతున్నాయి. భారత రాజ్యాంగ ఆదర్శాలకు వ్యతిరేకంగా సాగుతున్న వీటిని ప్రజాస్వామికీకరించాల్సిన అవసరం ఉంది. భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాలు, ఆశయాలు, మార్గదర్శకాలకు భిన్నంగా సమస్థ, వర్ణ, వర్గ, కుల, లింగ, జాతి, భాష, మత, వివక్షతలను ప్రేరేపించే, ఉద్దేశించే, వివక్ష, అస్పృశ్యత, కులాంతరాలు మొదలైనవాటిని సమర్థించే ప్రాచీన సాహిత్యం గానీ, సిద్ధాంతాలు గానీ, మతాలుగానీ, మత విశ్వాసాలు గానీ, భారత రాజ్యాంగం మౌలిక లక్ష్యాలకు వ్యతిరేకమైనవి. సంప్రదాయం, కళలు, సంగీతం, పురాణ ఇతిహాసాలు, మత బోధనలు, మత విశ్వాసాలు పేరిట భారత రాజ్యాంగ లక్ష్యాలకు వ్యతిరేకంగా నిత్యం బోధనలు, ప్రచారాలు సాహిత్య సృష్టి సాగుతూనే ఉన్నది. దీన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే ఏ కులం ఉపాధి కాదు ఏ కులం చిన్నది కాదు అన్ని కులాలు సమానమే. వర్ణవ్యవస్థ కుల వ్యవస్థల అంతరాలు నిరక్షలు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రచారం చేయడానికి వీలు లేదు.

అట్టడుగు వర్గాలు, ప్రత్యేకించి అంటరాని కులాల రాజకీయ హక్కులపై 1919లో సౌత్బరో కమిటీ ముందు సుదీర్ఘమైన అభ్యర్థన చేసేనాటికి అంబేద్కర్ వయస్సు ముప్పై ఏళ్లు. ఈ హక్కుల సాధన కోసం మూడు పాయల్లో వ్యూహాత్మకంగా తన ఉద్యమాన్ని కొనసాగించారు. అంబేద్కర్ షెడ్యూల్డ్ కులాల హక్కుల కోసం తుదిశ్వాస వరకూ పోరాడినప్పటికీ, అంతిమంగా ఒక ప్రజాస్వామ్య సమాజంలోనే దీనికి సంపూర్ణ పరిష్కారం సాధ్యమని బలంగా అభిప్రాయపడ్డారు. భారతదేశంలోని కుల వ్యవస్థను కూకటివేళ్ళతో పెకలించడానికి ఒక మహాప్రజాస్వామ్య ఉద్యమం ప్రారంభం కావాలి. ఈ ఆకాంక్షకు ఆచరణ రూపమివ్వడమే బాబాసాహెబ్కు ఘనమైన నివాళి.




" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు


## అస్తమించని జ్ఞానభాస్కరుడు... డాక్టర్ బిఆర్ అంబేద్కర్...



మహర్ గగనాన మెరిసిన ధృవతార
రాళ్ళలో రత్నం మట్టిలో మాణిక్యం
అజ్ఞానపు గంజాయి వనాన
అక్షర తులసి,ఆశల వేకువ.

బడుగుల గుండెల్లో కొలువైన దైవం
చీకటి దారుల్లో వెలిగే జ్ఞానదీపం
అంబేద్కర్ ఆశయం ఆకాశమంత
అణగారినవర్గాలకు కొండంత అండ

వీధిబడిలో తగిలే అవమానాల సెగలెన్నో
అవి సూర్యున్ని ఆపలేని మేఘమాలికలే
విదేశీ విశ్వవిద్యాలయాల్లో విద్యనార్జించే
హక్కుల్ని అక్షరబద్ధం చేసె రక్షణ కల్పించే

నిద్రాణమైన మేధస్సులకు మేల్కొలుపు
బావిలోని కప్పలకు ఒక బాటసారి
మూగగొంతులకు స్వరమిచ్చిన ఓకోయిల
పూరి గుడిసెలో పుట్టిన బహుజన బిడ్డలను
పులులుగా మార్చిన మేధావి

మనిషినిమనిషిగా చూడని మనువాదాన్ని
మేధాశక్తితో మట్టుపెట్టిన ధీరుడు వీరుడు
ఉగ్రూతలూగించిన ఉద్యమ కెరటం
కుల నిర్మూలనకు కంకణబద్ధుడు

అంటరానితనమనే విషవృక్షాన్ని
కూకటివేళ్లతో సహా పెకలించిన గొడ్డలి
అడుగునున్న బడుగులకు...
అణగారిన వర్గాలకు, హక్కులిచ్చిన...జ్ఞానదాత

తన రక్తాన్ని సిరాగా మలిచి
దేశ సౌభాగ్యానికి రక్షణ కవచంలా
రాజ్యాంగాన్నిచ్చిన...రాజ్యాంగ నిర్మాత

ఓ మహామేధావి
ఓ జ్ఞానసూర్యుడా
మీ అడుగుజాడలే
మాకు అమృత మార్గాలు
మీ స్మరణే మాకు ఓ ప్రేరణ
మీ ఆశయ సాధనే మా లక్ష్యం
ఓ భారత రత్నమా...
ఓ అమర జీవి
అంబేద్కర్
మీ దివ్య చరణాలకివే మా
అక్షర నీరాజనాలు,
వేలవేల వందనాలు...

(అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా కవిత)




కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# అంబేద్కర్ జీవితం
## ఒక గురువు చెప్పిన భావోద్వేగ కథ




క్లాస్‌రూమ్‌లో నిశ్శబ్దం. విద్యార్థులు అందరూ కూర్చున్నారు. బోర్డు ముందు గురువు నిలబడ్డాడు.
"ఈ రోజు నేను ఒక మహానుభావుడి గురించి చెబుతాను... ఆయన కథ వినితే మీ ఆలోచన మారుతుంది," అని ప్రారంభించాడు గురువు.
"ఒక చిన్న బాలుడు... పాఠశాలకు వెళ్తాడు. కానీ అతనికి ఇతర పిల్లలతో కలిసి కూర్చోవడానికి అనుమతి ఉండదు. నీళ్లు తాగాలంటే కూడా ఎవరో పోయాలి. ఎందుకంటే అతను తక్కువ కులానికి చెందినవాడు అని సమాజం అనుకుంది."
విద్యార్థుల ముఖాల్లో ఆశ్చర్యం.
"ఆ బాలుడు బాధపడ్డాడా? అవును. అవమానానికి గురయ్యాడా? అవును. కానీ ఒక విషయం అతను నిర్ణయించుకున్నాడు 'నేను చదువుకుంటాను... నేనెవరినీ అడగకుండా నిలబడతాను... ఒక రోజు ఈ అన్యాయం అంతా మార్చేస్తాను' అని."
ఆ బాలుడే అంబేద్కర్.
గురువు బోర్డు మీద ఆ పేరు రాశాడు.
"అన్ని కష్టాలు ఎదురైనా ఆయన చదువు ఆపలేదు. విదేశాలకు వెళ్లి ఉన్నత విద్య అభ్యసించి ప్రపంచాన్ని అర్థం చేసుకున్నాడు."
ఒక విద్యార్థి లేచి అడిగాడు:
"సర్, అంత అవమానం ఎదురైతే ఆయన ఎందుకు వదిలిపెట్టలేదు?"
గురువు చిరునవ్వు నవ్వాడు.
"అది నిజమైన శక్తి. మనల్ని తగ్గించేవాళ్ల వల్ల మనం తగ్గిపోవడం కాదు... వాళ్లకే సమాధానం అవ్వడం."
కొద్దిసేపు నిశ్శబ్దం.
"తర్వాత ఆయన ఏమి చేశాడో తెలుసా? తనకోసం కాదు... మనందరికోసం పోరాడాడు. ప్రతి మనిషికి సమాన హక్కులు రావాలని కృషి చేశాడు. చివరకు ఆయన భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపొందించాడు."
విద్యార్థులు గట్టిగా వినసాగారు.
"ఈ రోజు మీరు క్లాస్‌లో కూర్చొని చదువుకోవడం... మీ హక్కులు... మీ గౌరవం... ఇవన్నీ ఆ ఒక మనిషి పోరాటం వల్లే సాధ్యమయ్యాయి."
మరో విద్యార్థి మెల్లగా అన్నాడు:
"సర్... అంటే మనం చదవడం కూడా ఒక బాధ్యతే కదా?" గురువు తల ఊపాడు.
"అవును. చదువు అంటే మార్కులు కాదు... మార్పు. మీ జీవితాన్ని మాత్రమే కాదు... సమాజాన్ని మార్చే శక్తి."
క్లాస్ ముగిసే సమయంలో గురువు చివరి మాటలు అన్నాడు:
"అవమానం చూసిన ఒక బాలుడు... దేశానికి మార్గం చూపిన మహానుభావుడయ్యాడు. మీరిలో కూడా అలాంటి శక్తి ఉంది. ప్రశ్న ఒకటే మీరు దాన్ని ఉపయోగిస్తారా లేదా?"

రాసినోడు :
తేరాల. రాజేంద్ర ప్రసాద్ గుప్తా
హైదరాబాద్ - 9297109223

# పరీక్షలే జీవితం కాదు

తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో జరిగిన ఓ ఘటన తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. అందిన సమాచారం ప్రకారం, ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అవుతాననే భయంతో ఒక ఫస్ట్ ఇయర్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు., పరీక్షలు సరిగా రాయలేదని భావించి తీవ్ర ఆందోళనకు గురైన ఆ విద్యార్థి ఫలితాలు రావడానికి ముందే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.
అయితే, తర్వాత విడుదలైన ఫలితాల్లో అతను మంచి మార్కులతో పాస్ అయినట్లు బయటపడింది. సమాచారం ప్రకారం, మొత్తం 347 మార్కులు సాధించి ఉత్తీర్ణుడయ్యాడు. ఈ ఘటన కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఒక భయం ఎంత పెద్ద నష్టానికి దారితీసిందో ఈ సంఘటన చూపిస్తోంది.
ఈ ఘటనతో పరీక్షల ఒత్తిడి, విద్యార్థుల మానసిక స్థితి గురించి మరోసారి చర్చ మొదలైంది. మరి కొద్ది రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లో ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదల అవుతున్నాయి. ఈ క్రమంలో కార్పొరేట్ కళాశాలలు మంచి మార్కుల వచ్చిన విద్యార్థుల వివరాలతో కర పత్రాలు ముద్రించి హడావిడి చేస్తాయి. దాన్ని వారి వ్యాపారంలో భాగంగా చూడాలే తప్ప, మన వ్యక్తిగత జీవితానికి ఆపాదించుకోకూడదు. మార్కులు తగ్గినా, వెంటనే బెటర్ మెంట్ పరీక్ష ఉంటుంది.
పరీక్షల ఒత్తిడితో, ఫెయిల్ అవుతామని, ఫెయిల్ అయ్యామని ఆత్మహత్యలకు పాల్పడుతున్న విద్యార్థుల గురించి వినడం హృదయ విదారకంగా ఉంది. పరీక్షలే జీవితం కాదనే విషయాన్ని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు అర్థం చేసుకోవాలి.
ఎందరో గొప్ప వారు తొలుత పరాజయం పొందినవారే. అమెరికా మాజీ అధ్యక్షులు అబ్రహం లింకన్ ఎన్నో సార్లు ఎన్నికల్లో ఓడిపోయారు. చివరికి అమెరికా అధ్యక్షులు అయ్యారు. ఇంకా హాకింగ్, ఎడిసన్ వంటి శాస్త్రవేత్తలు తమ అంగ వైకాల్యాన్ని అధిగమించి, జీవితంలో విజయం సాధించారు. మనకు ఒకే ఒక జీవితం ఉంటుంది. పరీక్షలలో ఫెయిల్ అయితే జీవితం ముగిసి పోదు. సెలవుల్లో జాగ్రత్తగా చదవాలి. పునః సమీక్ష చేసుకోవాలి. కాపీల ద్వారా గాకుండా, కష్ట పడి చదివి పాస్ అవ్వాలి . అధ్యాపకుల సలహాలు తీసుకోవాలి. వారిని గౌరవించాలి. ఐ. పి ఎల్ మ్యాచులకు దూరంగా ఉండాలి. అంతే గానీ ఒత్తిడికి గురై, జీవితాన్ని బలి తీసుకోకూడదు. మనం ఏదైనా సాధించాలంటే జీవించాలి. లోపాలను సరిదిద్దుకోవాలి. ఎవరికైనా అవమానాలు వస్తాయి. వాటిని గురించి పెద్దగా ఆలోచించ వద్దు. ఒక్కసారి విజయం సాధిస్తే ఇటువంటి అనుమానపు మేఘాలు మొత్తం మాటు మాయం అవుతాయి.


యం.రాం ప్రదీప్

# సంక్షేమ అభివృద్ధి లక్ష్యం

- రాష్ట్ర కమిటీ ఏర్పాటు
- ఏపీ నాగవంశం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రమణారావు వెల్లడించారు

**నవతరం-తగరపువలస**

నాగవంశీయుల సంక్షేమానికి రాష్ట్ర కమిటీ ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉందని ఏపీ నాగవంశ సంక్షేమ అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు చెప్పారు. రాష్ట్ర నాగవంశం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటుపై తగరపువలస లోని విశ్వం గ్రాండ్ లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర నాగవంశం ప్రతినిధుల సమావేశంలో ఏపీ నాగవంశం కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు అధ్యక్షత వహించగా, కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యం వహించారు.
ఈసమావేశంలో ఎరుబోతు రమణారావు ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుండి మన వంశీయుల సంక్షేమానికి అవసరమైన కార్యక్రమాల సాధన కోసం కార్పొరేషన్ తరపున ప్రభుత్వ ప్రతినిధులుగా తమతో పాటు రాష్ట్ర నాగవంశం సంక్షేమం సంఘం కమిటీ సభ్యులు కూడా కలసి వస్తే బీసీ డీ నుండి బీసీ ఏ కు మార్చడంతో పాటు ఇతర సంక్షేమ పథకాలు, మన వంశీయులు ఉన్న ప్రాంతాలలో కళ్యాణమండపాలు నిర్మాణం కొరకు స్థలాలు, నిధులు ప్రభుత్వం నుండి పొందడానికి అందరు సమిష్టిగా ప్రయత్నం చేయడానికి వీళ్లవుతుందాన్నారు.
ఈ సందర్భంగా నాగవంశ అభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చించారు. సభలో వాడి వేడిగా చర్చ కొనసాగింది. గతంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కమిటీ 2016లో ఏర్పడి ఒక్క సమావేశం కూడా నిర్వహించకపోవడంతో పాత కమిటీ లో ఉన్నవాళ్లు తీవ్ర విమర్శలు ఆరోపణలు చేశారు కొత్తగా ఏర్పడిన కమిటీ కూడా అదే రీతిలో ఉండకూడదని గంట పదం గా సభలో చర్చ కొనసాగింది. ముఖ్యంగా రాష్ట్ర నూతన కమిటీ





ఏర్పాటు, జిల్లా, నగర కమిటీల ఎంపికపై కుల సంఘ పెద్దలతో సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి అడహాక్ కమిటీని ఏర్పాటు చేసి, అనంతరం జిల్లా మరియు నగర కమిటీలను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా, ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి నాగవంశీయుల సమస్యలపై సమగ్ర అధ్యయనం చేసి, వారి అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వంతో కలిసి సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు.
ఈసందర్భంగా సీనియర్ పాత్రికేయులు జర్జాపు శేషగిరి రూపొందించిన నాగవంశ పరిణయ పరిచయ వేదిక కరపత్రాలను ఆవిష్కరణ చేశారు. మే 3న విజయనగరం లో జరిగే పరిణయ వేదిక కార్యక్రమం నకు వచ్చేవారికి అన్ని ఏర్పాట్లు చేస్తామని శేషగిరి తెలిపారు. అనంతరం అతిధులకు సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో ఏపీ నాగవంశ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బొడ్డు అప్పలనాయుడు భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పుడు, పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, కాళ్ళ నగేష్ కుమార్ , రాంభుక్త కన్నారావు, అవనాపు వీర్రాజు చిలక నర్సింగా రావు, నింగిబోతు జనార్ధన్, బెవర రాము, కార్పొరేషన్ డైరెక్టర్లు మొకర ఆదిబాబు, సురాల సత్యారావు, కుమారస్వామి అనంతకుమార్, గాడు అప్పలనాయుడు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు ముని శ్రీనివాసరావు, బుగత నర్సింగరావు, గాడు శ్రీను, ముని మోహన్ కృష్ణ కాళ్ల శ్రావణ్ కుమార్, బాయి వెంకటరావు, మద్దిల శ్రీనివాసరావు, ముని శ్రీరామకృష్ణ, మొఖర వెంకట మల్లేశ్వరరావు, కంటుబోతు ముత్యాలరావు, ఎర్నింటి కిట్టు, కంటుబోతు శ్రీనివాస్ కార్పొరేషన్ డైరెక్టర్లు, కులసంఘ పెద్దలు మరియు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశానికి దిక్సూచి బాబాసాహెబ్ అంబేద్కర్

## వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు

**నవతరం-పలాస**



భారతరత్న, ప్రపంచ మేధావుల్లో ఒకరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాయడం భారతీయులకు గొప్ప వరమన్నారు. ఈ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయ పౌరుడుపై ఉందన్నారు. ఒకప్పుడు మన దేశానికి స్వాతంత్ర్యం రాకమునుపే మనువు సిద్ధాంతం ఉండేదని, ఆ రాజ్యాంగంలో మనుషులను మనుషులుగా గుర్తించకుండా హీనంగా చూసే రోజులలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 1948లో భారత రాజ్యాంగం రచించారన్నారు. భారత రాజ్యాంగాన్ని రెండు సంవత్సరాల 11 నెలలు నిద్రాహారాలకు దూరంగా ఉండి అహర్నిశలు కృషిచేసి రాజ్యాంగ రచనకు అంకితమయ్యారని తెలిపారు. ధనిక, పేద, మత, వర్గ బేధం లేకుండా దేశ ప్రజలందరికీ ఆమోదయోగ్యంగా ఉండే విధంగా భారత రాజ్యాంగాన్ని రచించారని ఆయన వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించారని తెలిపారు. న్యాయశాఖ మంత్రిగా ఉన్న సమయంలో పురుషులతో సమానంగా స్త్రీలకు హక్కులు ఉండాలని 1951 ఫిబ్రవరి 5న హిందూ కోడ్ బిల్లు పార్లమెంట్లో పెట్టారని, బిల్లు వీగిపోవడంతో తన మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. ఉన్నత ఆశయాలతో జీవితాన్ని అంతా సమాజానికి అంకితం చేశారని కొనియాడారు. నేటికీ ఆయన ఆశయాలు పూర్తిగా నెరవేర లేకపోయాయని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకెళ్లాలని, ఆయన కన్న కలలను సాకారశీ అయ్యే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బమ్మిడి దుర్యోధనరావు కోరారు.

# తీర గ్రామాల భూ సమస్యల పరిష్కారానికి వేగం

- ఫారెస్ట్ రికార్డుల సవరణపై చర్యలు
- సీఎం దృష్టికి సమస్య
- గ్రామ కంఠాలుగా గుర్తింపుకు కృషి
- అభివృద్ధికి అడ్డంకులు తొలగింపు

**నవతరం -శ్రీకాకుళం**

పోలాకి మండల తీర ప్రాంత గ్రామాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు వేగం పుంజుకున్నాయి. ఫారెస్ట్ ల్యాండ్‌గా నమోదైన గ్రామాల వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో ఈ అంశాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్లారు.
గుప్పడపేట, గుల్లవానిపేట, కొత్తరేవు, కొవిరిపేట తదితర గ్రామాలు అటవీ భూమిగా నమోదు కావడంతో ఇళ్ల నిర్మాణం, పాఠశాలలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్యపై సానుకూల స్పందన రావడంతో అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి సర్వే చేపట్టేందుకు సిద్ధమయ్యారు.
గ్రామాలను 'గ్రామ కంఠం'గా గుర్తించి రికార్డులు సవరించిన వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ చర్యలతో తీర ప్రాంత ప్రజలకు దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**